

కథ

# శిక్ష

బ్నిం

సుహాసిని తనే చట్టమై, ధర్మమై, న్యాయమై వ్యవహరించింది. ఒక శిక్ష విసిరింది - అది.... తన మీద... తన కుటుంబం మీద... కడుపులో ఉన్న బిడ్డ మీద.... అందరిమీద పడింది.

అది 'మూర్ఖత్వం' అని కొంత మంది... 'అపార్థం' అని మరికొంతమంది... 'అన్యాయం' అని ఇంకొందరూ అనుకుంటూంటారు - అసలు జరిగిన కథ తెల్సుకుంటే... సుహాసినిది తప్పో - రైటో మీరూ ఆలోచించొచ్చు !!

✿ ✿ ✿

సుహాసినికి రెండేళ్ళ క్రితం పెళ్ళైంది - తనలాగే అందమైన మొగుడు - అన్యోన్యమైన దాంపత్యం. ఒకళ్ళంటే ఒకళ్ళకి ఎక్కువ ప్రేమ - రెండేళ్ళు పిల్లా జెల్లా కలక్కుండా ఆనందాల అంచులు చూశాక సుహాసిని గర్భవతైంది - భర్త మాధవరావు ఇంకా ప్రేమ కురిపించాడు సుహాసిని మీద -

తల్లి లేని సుహాసినికి ఆ లోటు తెలియకుండా పెంచి పెళ్లి చేసిన తండ్రి కడుపుతో ఉన్న కూతుర్ని తీసుకొచ్చి ఘనంగా సీమంతం చేయించాలని సరదా పడ్డాడు -

రెండో కూతురు సునీత కూడా మరింత ఉత్సాహంగా తనే పెద్ద ముత్తయిదువులా ఏర్పాట్లు చేసేస్తోంది - కాలేజీకి వారం రోజులు దుమ్మా కొట్టెయ్యడానికి పథకం వేసుకుంది - తనతో బాటు డిగ్రీ రెండో ఏడు చదువుతున్న నియరెస్ట్

## రచయిత్రి - రంగస్థల అభినేత్రి

# మహాబానూ మోడీ కొత్వాల

హాస్యనటి మహాబానూ మోడీ కొత్వాల్ అటు రచయిత్రిగానే కాకుండా రంగస్థలాన్నీ ఏలారు. ఈ క్రమంలో ఆమె భారతదేశంలోని, విదేశాల్లోని అనేక సినీ రంగ ప్రముఖులతోను కలిసి పనిచేశారు. ఆమెవైన 'ది వజీనా మోనోలాగ్స్' వివిధ నగరాల్లో వందలాది ప్రదర్శనలు జరిగాయి.

'వజీనా' బజ్‌వర్డ్‌గా ప్రతిధ్వనించేలా చేసిన ఆమె మహిళల సమస్యల పట్ల సమాజానికి తగినంత గౌరవం లేదని మహిళాశక్తి మహత్తరమైనదని ఆమె ఋజువు చేశారు. ఆ 'పదం' ప్రయోగించటంలో ఆమె సాహసానికి జనం బిత్తర పోయారు.

'ది వజీనా మోనోలాగ్స్' జనాన్ని ఆలోచింపచేశాయి. ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మహిళకు విద్యే ఆయుధం అంటారా మహిళామణి.



ఫ్రెండ్స్‌ని కూడా కాలేజీ ఎగ్గొట్టి పిలుపులకీ, పేరంటాలకీ తోడుగా ఉండటానికి ఎంగేజ్ చేసింది -

ఓ రోజు రాత్రి బస్సుకు అమలాపురం బైల్దేరి, మర్నాడు పొద్దున్నే అద్దెకార్లో ఆత్రేయపురం తీసుకొచ్చాడు సుహాసినిని తండ్రి - "కారెందుకు నాన్నా" అని కూతురంటే.... "నీ కోసం కాదులే... నా మనవడి కోసం" అన్నాడు పెద్దాయన -

బైల్దేరే ముందు.... "సీమంతం నాటికి మీరు కూడా...." సిగ్గుపడ్తూ మొహమాటంగా పిల్చింది సుహాసిని భర్తని -

"పేరంటానికి రావాలా ? చీర కట్టుకునా... మామూలుగానా..."

"మీ ఇష్టం - ఏవో బట్టలైతే వేసుకు రండి -"సుహాసనంతో అంది -

"ఇయరెండింగ్ - ఆఫీసులో బోల్డుపని - 'లీవ్' అడిగితే 'కెవ్' అంటారు - బాస్ కన్నా.... కొలీగ్స్ గోలెట్టేస్తారు - అని సాగనంపాడు మాధవరావు.

సునీత - అక్కని అట్టహాసంగా రిసీవ్ చేసుకుంది - అమ్మ ఉంటే ఏం చేస్తుందో అలాగే అన్ని ఏర్పాట్లూ చేసింది.... "పెద్ద ఆరిందాలా'- అదే మాట సునీతతో అనేసింది అక్క. సునీత చలాకీగా.... "నీకన్నా నేనే పొడుగు - పెద్ద ఆరిందానే" అని నవ్వేసింది.

నిర్ణయించిన సుముహూర్తానికి సీమంతోత్సవం మహోత్సవంగా జరిపించింది సునీత- పూలజడ కుట్టింది - పట్టుచీర ఇచ్చింది -గాజులు తొడిగించింది -పేరంటం చేస్తోంది.

అనూహ్యంగా.... ఆశ్చర్య పరిచేలా.... మాధవరావు గుమ్మంలో కనిపించాడు సునీతకి - తన రాకని అక్కకి చెప్పద్దని సైగ చేసాడు మరదలికి - సిగ్గుపడుతుందని.

చుట్టూ పేరంటాళ్ళు - ఆడాళ్ళు ఏవేవో ఉత్సవాలు జరుగుతున్నాయి - సుహాసిని చాలాఅందంగా ఉంది. థ్రిల్లింగా చూస్తున్నాడు.

సునీత అంత హడావుడిలోనూ.... మధ్యమధ్యలో బావగారి కేసి చూస్తూ.... "ఎలా వుంది మా అక్క" అనే అర్థం వచ్చేలా సైగ చేస్తోంది - 'అద్భుతం' అన్నట్లు బొటనవేలు చూపిస్తున్నాడు - మరికొంతసేపు 'నువ్వొచ్చావన్నట్లు అక్కకి చెప్పేస్తా' అని కళ్ళతో సైగచేసి చూపుడు వేల్తో బెదిరించింది -

'ప్లీజ్' అన్నట్లు దణ్ణం పెట్టి, గెడ్డం పట్టుకున్నట్లు చేతిని చూపిస్తూ బతిమాలాడు.

'దొరికావులే దొరా!' అన్నట్లు సత్యభామ భంగిమ పెట్టింది మరదలుపిల్ల - అప్పుడు చూసాడు - పెళ్ళినాటి పెళ్ళాం కన్నా అందంగా మెరిసిపోతోంది సునీత-క్రమంగా భార్య నుంచి చూపులు మరలి మరదలు వైపు నిలిచిపోతున్నాయి - 'ఛ! తప్పు' అనుకున్నప్పుడే సుహాసినిని చూడగల్గుతున్నాడు.

సుహాసినికి హారతి ఇస్తున్నారు - అందరూ వెనక్కి తిరిగారు. సునీతది సన్నటి నడుము-లంగా వోణీ వేసుకుంది - పొడుగాటి జడ - భుజాలంటుతున్న మల్లెపూలు - ఖచ్చితంగా సుహాసిని కన్నా గ్లామరుంది - తల తిప్పి రెండుసార్లు వెనక్కి చూసింది - విశాల నేత్రాలు రెండుసార్లు ఎగరేసింది... ఎలా వుంది నా ఏర్పాటు అన్నట్లు - మాధవరావు కన్ను కొట్టాడు - సునీత ఉలిక్కిపడింది - గిరుక్కున తల తిప్పుకుంది - మళ్ళీ కాసేపు మాధవరావుకి జడ - నడుమూ.. తల్లోపూలు... కని పిస్తున్నాయి.... మంగళహారతి పాట కొనసాగుతోంది.

కాస్సేపటికి మళ్ళీ వెనక్కి తిరిగింది - ఇప్పుడా కళ్ళల్లో చలాకీతనం లేదు - బిడియం! ఇష్టం !! ఆరాధన !! భయం !! మాధవరావు మళ్ళీ కన్ను కొట్టాడు ! - అరక్షణంలో "హాయ్... బావగారు వచ్చారు" అని మొదటిసారి చూసినట్లు ఎక్స్‌ప్రెషన్తో... అరిచి అందర్నీ అలర్ట్ చేసింది - నిజంగా అందరూ సర్దుకున్నారు - తన కుర్చీలోంచి లేచి సుహాసిని మాధవరావు రాకకి థ్రిల్ అవుతూ నవ్వింది - మాధవరావు సునీత నుంచి సుహాసిని ట్రాక్‌కి వచ్చేసాడు - పేరంటాల ప్రోగ్రాం అవగానే అందరూ వెళ్ళిపోయాక.... భోజనాలు గట్రా పూర్తవు తుంటేనూ... అందరూ కల్సి వున్నప్పుడూ... మాధవరావు కళ్ళు సునీత కళ్ళతో అప్పు డప్పుడూ మాట్లాడుకుంటూ ఉండేవి. ఇద్దరికీ మొహమాటం - ఆ మాటలు 'తప్పు' అనే భావనా... వుండేవి.

కానీ ఆ రాత్రి డాబా మీద పక్కలు పరుచుకుని భార్యతో కబుర్లు చెబ్దామని ఎదురు చూస్తున్న మాధవరావు దగ్గరికి మజ్జిగ గ్లాసు పట్టుకుని అక్క కన్నా ముందే సునీత వచ్చింది - "బావా... మజ్జిగ - అందరూ పడుకునే ముందు పాలు తాగితే నీకు మజ్జిగ అలవాటు ఏంటి?" అంది.... చలాకీగా సునీత. "కిక్కు దిగటానికి -" మాధవరావు అన్నాడు. "కిక్కా!..." కిలారున నవ్వింది - "అంటే.... నువ్వు....??"

కొశ్చన్ మార్క్ మొహం కూడా అందంగా కనిపించేలా అడిగింది....

"కిక్కు తాగినందుకే రాదు.... నీలాంటి అందమైన అమ్మాయిని చూసినా..." అని కవ్విస్తూ ఆగాడు. "అది కిక్కు కాదు తిక్క అంటారు". అని గల్లున నవ్వింది. మాధవరావు మజ్జిగ గ్లాసు అందుకోవడం నిజానికి.... అరక్షణం సేపే - కానీ గ్లాసు పట్టుకున్న రెండు చేతుల వేళ్ళూ కొన్ని పదుల క్షణాలు మాట్లాడుకున్నాయి.

ఒకళ్ళ కళ్ళలో... బిడియం - ఇంకోళ్ళ కళ్ళలో భయం - రెండు చూపుల్లోనూ.... ప్రేమ - అనురాగం - ఏంటో... ఏంటో... అలా ఇద్దరి చేతుల్లోనూ ఒక గ్లాసు ఎటెళ్ళాలో తేల్చుకోలేదు గానీ.....మాధవరావు రెండో చెయ్యి కూడా గ్లాసు పట్టుకొచ్చిన చేతి మీద జాయినైంది - ఆ చెయ్యి పులకింతగా వొణికింది - మజ్జిగ తొణికింది - మజ్జిగ గ్లాసు మాధవరావు కింద పెట్టాడు - ఇప్పుడు రెండు చేతుల మధ్య గ్లాసు లేదు.... 'గ్లాసు' నిడివి ఎడం కూడా లేదు -

ఆ క్షణంలో....

సరిగ్గా అదే క్షణంలో... సుహాసిని ఎంటరైంది - 'పర'వశం అయిపోతూన్న భర్తనీ... పరవశంలో వున్న చెల్లినీ చూసింది- ఆమె కోపం ఆరంభం నుంచీ పతాకస్థాయికి చేరిపోయింది.

అంతే....!!

కథ మొదలయింది. ఆమె అరవలేదు. ఎవర్నీ తిట్టలేదు. తన మంగళసూత్రాల్ని పుటుక్కున తెంపేసి భర్త చేతికి ఇచ్చింది. "సునీత మెళ్ళో కట్టండి...!!" అంటూ కట్టడి చేసింది - సునీత షాకైంది.

భోరుమని ఏడ్చింది. సంజాయిషీ ఇచ్చింది. జవాబు చెప్పలేదు సుహాసిని - ఆమె బొట్టు చెరిపేసుకుంది. "నాకు మొగుడు లేదు - నీ మొగుడు వీడు" అంది.

అచేతనం అయిన మాధవరావు చాలా ప్రయత్నం చేయబోయాడు. తామింకా ఏ తప్పూ చేయలేదని నచ్చచెప్పబోయాడు సునీత - మాధవరావు ఇద్దరూ తక్షణం ఇల్లు విడిచి వెళ్ళిపోవాలని శాసించింది. వెళ్ళడం ఆలస్యమయితే తాను చస్తానని... తలుపులు బిగించి హెచ్చరించింది.సునీతా మాధవరావూ ఇద్దరూ చాలాసేపు తలుపులు బాది వ్యర్థ ప్రయత్నాలు చేసారు.

✿ ✿ ✿

సుహాసిని తండ్రి అయోమయంగా మిగిలిపోయాడు. ఆయనకి జడ్జిమెంట్ ఇచ్చే శక్తి లేదు.

జరిగిన సంగతిలో తప్పూ ఒప్పులు తూచే ఆసక్తీ లేదు - ఆయన త్రాసులో ఇద్దరు కూతుళ్ళూ ఉన్నారు ! ఎటువైపూ మొగ్గలేదు - కానీ... సుహాసిని కడుపులో బిడ్డ బరువు పెరిగింది.

సునీతని తీసుకుని వెళ్ళిపొమ్మని అల్లుడికి కన్నీళ్ళతో దణ్ణం పెట్టాడు - మాధవరావు భార్య తెంపి ఇచ్చిన మంగళసూత్రాలు... అతని చేతులో పెట్టాడు తండ్రి. కన్నీళ్ళు నిండుగా పొర్లిపోతుండగా -

✿ ✿ ✿

తప్పని పరిస్థితుల్లో .... సునీతా మాధవరావు ఇల్లు విడిచి వచ్చేశారు. మాధవ రావూ సునీతా మళ్ళీ మళ్ళీ సుహాసినిని కలవాలని చాలాసార్లు ప్రయత్నించారు - మీరు కనిపిస్తేనే చస్తానని బెదిరించేది.

మాధవరావు.... కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్న సునీతని అమలాపురం తీసుకెళ్ళాడు. ఉన్నారు గనక తినడం - తింటున్నారు గనక ఉండటం - రోజూ ఆమెకో క్షమాపణ ఉత్తరం.... నిజం తెల్సుకోమన్న 'నిజం' రాయడం - ఆమె చించిపారేయడం-ఇలాగే.. జరుగుతోంది!! కొన్నాళ్ళు పోయాక ఇంక జాబు రాని ఉత్తరాలు రాయక్కర్లేదని మాధవరావు సునీతని మందలించాడు. వాళ్ళిద్దరి మధ్య వ్యామోహం లేదు. ఒకళ్ళమీద ఒకళ్ళకి కాంక్ష లేదు.

✿ ✿ ✿

పాతికేళ్ళు గడిచిపోయాయి.

సుహాసిని కన్న కొడుకు సుధాకర్... మంచి పేరున్న అడ్వకేట్ - తండ్రి లేని లోటుని తెలీకుండా తల్లీ తాతా ప్రేమగా పెంచారు. ఆ కృతజ్ఞత అతనికి వుంది - తాతగారు కూడా చనిపోయే దాకా ఈ కథ ఎప్పుడూ సుధాకర్‌కి చెప్పలేదు.

మొన్నే ఓ ఉత్తరం వొచ్చింది.

ఆ ఉత్తరం సుధాకర్‌ని రెండ్రోజులు కుదిపేసింది. అమ్మతో అస్సలు మాట్లాడలేదు. నాన్నకీ, పిన్నికీ వెలో, బహిష్కారమో తెలియని



## డైరెక్టర్ మీరానాయర్

కళాశాల స్థాయిలోనే 'మీరానాయర్' కథన కళను ఆరంభించారు. అక్కడే ఆమె పొలిటికల్ స్ట్రీట్ థియేటర్ అనే అమెచ్యూర్ డ్రామా కంపెనీలో పనిచేశారు. ఆ తరువాత హార్వర్డ్ యూనివర్శిటీ స్కాలర్‌షిప్, చలనచిత్రాల్లో అవకాశం ఆమెకు లభించాయి.

భారతీయ చలనచిత్రాన్ని ఆమె ప్రపంచస్థాయికి తీసుకువెళ్ళి దాని కొక కళాత్మక గౌరవాన్ని సాధించారు. ఆమె డాక్యుమెంటరీకి అంతర్జాతీయ పురస్కారం, 'సలాం బాంబే' చిత్రానికి విమర్శలు, అభినందనలు 'మాన్సూన్ వెడ్డింగ్'కు వ్యాపార విజయం లభించాయి.

సామాజిక రుగ్మతలే ప్రధానాంశాలుగా ఉండే ఆమె చిత్రాలు ప్రజలలో వాటిపట్ల అవగాహన పెంచేందుకు ఉపకరించాయి. ఉగాండాలో ఫిల్మ్ లాబ్ స్థాపించారు. న్యూయార్క్ కొలంబియా యూనివర్శిటీలలోని ఫిల్మ్ డివిజన్‌లో ఆమె అధ్యాపకురాలు కూడా.

శిక్ష విధించిన అమ్మని నిజానికి చూడాలనే లేదు.

అమ్మ చింపేసిన నాన్న రాసిన వుత్తరం డస్ట్‌బిన్‌లోంచి ఏరుకుని, ముక్కలన్నీ అతుక్కుని... మళ్ళీ మళ్ళీ చదువుకుని కుమిలిపోయాడు. పిన్ని కేన్సర్ రోగంతో చనిపోతుందంట.

"చనిపోయే ముందు ఒక్కసారైనా... నువ్వు మీ చెల్లాయిని... అదే మన సునీతని క్షమించడానికి రావా? నువ్వొస్తే తను మనశ్శాంతిగా చనిపోతుంది" - అని కరుణ పూరితంగా మాధవరావు రాసిన వుత్తరం సుధాకర్ మనస్సుని అల్లకల్లోలం చేసింది.

మర్నాడు పొద్దున్నే... సుహాసిని కొడుకు పుట్టిన రోజని ర్యాలి గుళ్ళో పూజ చేయించాలని కొడుకు నిద్ర లేవకుండానే తయారైంది.

రాత్రంతా ఆలోచనతో నిద్రలేని సుధాకర్‌కి తెల్లారినా పక్కమీంచి లేవాలని పించలేదు.

తల్లి కొడుకుని లేపి.... బర్త్‌డే విషెస్ చెప్పి... "జగన్మోహినీ కేశవస్వామిని దర్శించు కుని 'మోహిని' లాంటి పెళ్ళాన్ని నీకిమ్మని అడగాలి" అంటూ కొడుకుని రడీ అవమని తొందర పెట్టింది.

తల్లిని కారెక్కించుకుని స్టార్ట్ చేశాడు సుధాకర్. బైల్దేరుతూ.... "అమ్మా... అమలాపురం మనం 2 గంటల్లో వెళ్ళగలమా?" అన్నాడు.

కస్సుమంది కన్నతల్లి.

"అమలాపురం దేనికి" కోపంగా అరిచింది.

"నాన్నా పిన్ని అక్కడే వున్నారటగా."

ఆమె షాకైంది - "ఎవరు చెప్పారు" మళ్ళీ గర్జించింది ఆడపులి.

సుధాకర్ చెప్తున్నాడు. "అమ్మా! ఎవరు చెప్పారన్నది కాదు. నీకో మాట చెప్పాలి.

"చట్టం - ధర్మం - న్యాయం అనే మూడింటినీ నమ్మే అడ్వకేట్‌గా తీర్చిదిద్దావు.

చట్టం ఒక దోషికి యావజ్జీవ కారాగారశిక్ష వేసిన ఇలా పాతికేళ్ళు వుండదు. మనం ఎవరికి ద్రోహం చేస్తున్నాం?? మన కొడుకికా?...భర్తకా?...చెల్లికా?....అనేది ఆలోచించమంటుంది ధర్మం.

న్యాయం వుంది చూడు - అది ఉరికంబం ఎక్కుతున్న వ్యక్తికి కూడా ఆఖరి కోర్కె తీర్చమంటుంది.

ఈ మూడూ మన కుటుంబ విషయంలో తప్పే అని చెప్పాలి.

నీ కోపంతో నన్ను తండ్రి లేని బిడ్డని చేశావు.

పిన్నిని జీవితం లేని జీవచ్ఛవాన్ని చేశావు.

నాన్నని నిర్దాక్షిణ్యంగా దోషిని చేశావు..

కన్నీళ్ళు ఉబుకుతుండగా సుహాసిని.... "నేను... నేను... ఏ ఆడదీ కోరుకోని వైధవ్యపు శిక్షని అనుభవించాను. నువ్విప్పాళ వాళ్ళ వైపు తిరిగి..."

"అమ్మా... నాకేంచెప్పకు. నువ్వు నాతో వస్తే రా! నేను మాత్రం... అమలాపురం వెళ్తున్నాను." అన్నాడు సుధాకర్.

సుహాసిని కారు దిగాలా? వద్దా? అని సందిగ్ధంగా ఉంది. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. ఆ నిప్పుల్ని కన్నీళ్ళు కడిగేస్తున్నాయి...

స్థిరచిత్తంతో సుధాకర్ కారు వేగం పెంచాడు.

# చినుకు సమాచారం

## విశ్వశాంతికోసం కవితల ఆహ్వానం

నేడు సైతం అన్యాయం, అక్రమం, మతతత్త్వ ఉగ్రవాదం, అగ్రవాదం, తీవ్రవాదాలు సమాజాన్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. ఈ తరుణంలో ప్రేమ, దయ, సహనం, త్యాగం వంటి మానవతా విలువలతో నిండిన సాహిత్యం అవసరం ఎంతో ఉన్నది. కనుక "విశ్వశాంతికి అక్షరక్రాంతి" పేరుతో త్వరలో వెలువరించనున్న కవితా సంకలనానికి క్రైస్తవ రచయితలు, కవులు 20 లైన్లకు మించని తమ కవితలను ఝాన్సీ కె.వి.కుమారి, (M) 9948094563, B-2, Express Apartments, గంగా జమునా బేకరి లేన్, లక్డి-కా-పూల్, హైదరాబాద్ - 500 004. చిరునామాకు 2007 అక్టోబర్ 20వ తేదీలోపు పంపవలసిందిగా కోరుతున్నాం.

## డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి కథా పురస్కారం - 2007

నందలూరు కథానిలయం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉత్తమ కథా రచయిత / రచయిత్రికి ప్రతి ఏటా అందించే ప్రతిష్టాకరమైన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, "డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి కథా పురస్కారం - 2007" కోసం కథా సంపుటిలను పంపవలసిందిగా కోరుతున్నాం. ఉత్తమంగా ఎంపికయిన కథా రచయితకు ఐదువేల రూపాయల నగదుతో పాటు, శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరిస్తారు. కథకులు తమ కథా సంపుటిలు ఎప్పటివైనా పంపించవచ్చు. ఫలానా సంవత్సరంలోనే ప్రచురణయి ఉండాలనే నిబంధన లేదు. కథకులు రెండేసి ప్రతులతో ఎ.రాజేంద్రప్రసాద్ అధ్యక్షులు, నందలూరు కథానిలయం, నందలూరు - 516 150. కడపజిల్లా చిరునామాకు 30-01-2008 తేదీ లోపల పంపుకోవాల్సి ఉంటుంది. డాక్టర్ కేతు పురస్కారం 2005లో సింగమనేని నారాయణ, 2006లో వి. ప్రతిమ అందుకొని ఉన్నారు. ఈ పురస్కారానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం 94410 56159 లో సంప్రదించవచ్చు.